క్లుప్తంగా

నేలకొరిగిన విద్యుత్ తీగలు



మక్కువ, చెముడు రహదారుల మధ్య విద్యుత్ తీగలపై కూలిన కొబ్బరిచెట్టు

మక్కువ: మండలంలోని మక్కువ, చెముడు రహదారుల మధ్య ఆదివారం వీచిన ఈదురు గాలులకు విద్యుత్ తీగలు నేలకొరిగాయి. ఆదివారం సాయంత్రం గాలి బీభత్సంతో విద్యుత్ స్తంభంపై కొబ్బరి చెట్టు పడగా స్తంభం నేల కొరిగి, విద్యుత్ తీగలు కింద పడిపోయాయి. మక్కువ, చెముడు రహదారుల మధ్య నిత్యం వాహనాలు రద్దీగా తిరుగుతుంటాయి. అయితే ఆ సమయంలో ఎవరూ రహదారిపై లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని తీగలను సరిచేశారు.

సీసీ కెమెరాల ఏర్పాటు



మోసూరు గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

పాచిపెంట: మండలంలోని మోసూరు గ్రామంలో ఆదివారం పది సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్సై వెంకటసురేష్ తెలిపారు. మోసూరు గ్రామం నుంచి తరచూ ఎక్కువ కేసులు నమోదు కావడంతో ఆ గ్రామాన్ని సమస్యాత్మకంగా గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఇంకా మండలంలో సమస్యాత్మక గ్రామాలు గుర్తించి త్వరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

సీఆర్‌టీ పోస్టులను కలపడం అన్యాయం



ఎస్. మురళీమోహనరావు

పార్వతీపురం టౌన్: గిరిజన సంక్షేమ పాఠశాలల్లోని సీఆర్‌టీ పోస్టులను డీఎస్సీలో కలపడం అన్యాయమని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పటికే అవుట్ సోర్సింగ్ విధానంలో కొంతమంది సీఆర్‌టీలుగా వ్యవహరిస్తున్నారని.. అటువంటి వారిని తీసేయడం సరికాదన్నారు. పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తే 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అలాగే జీపీఎస్ (టీడబ్ల్యూ) పాఠశాలల్లో ఉన్న ఖాళీలను గిరిజనులతోనే భర్తీ చేయాలని కోరారు.

లచ్చయ్యపేట సర్పంచ్ సీహెచ్ కృష్ణ మృతి



చింతాడ కృష్ణ (ఫైల్)

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట గ్రామ పంచాయతీ సర్పంచ్ చింతాడ కృష్ణ (41) ఆదివారం మధ్యాహ్నం ఆకస్మికంగా మృతి చెందారు. ఈస్టర్ పండగలో పాల్గొన్న కృష్ణ అనంతరం గ్రామంలోని బోరుబావిని పరిశీలించారు. ఆ తర్వాత ఇంటికి వచ్చి ఒక్కసారిగా వాంతి చేసుకుని అపస్మారక స్థితికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు బొబ్బిలి ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో చనిపోయారు. మృతుడి భార్య కూడా గతంలో చనిపోగా.. ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. సర్పంచ్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

పారిశుధ్య లోపంపై అవగాహన



సూరంపేటలో కళాజాత ప్రదర్శన

సీతానగరం: పారిశుధ్య లోపం వల్ల కలిగే అనర్థాలపై కళాజాత కళాకారులు అవగాహన కల్పిస్తున్నారు. మండలంలోని నిడగల్లు, పాపమ్మవలస, సూరంపేట, మరిపివలస గ్రామాల్లో కళాజాత కళాకారులు మిరియాల బాలాజీ, బాలు, తదితరులు ఆదివారం కళాజాత ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గందరగోళంలో విద్యారంగం

- ఏపీటీఎఫ్ నాయకులు

పార్వతీపురం టౌన్: ప్రభుత్వం గంటకో విధానం తీసుకువస్తూ విద్యారంగాన్ని గందరగోళంలోకి నెట్టిందని ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేష్, బాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గత ప్రభుత్వం ఆరు రకాల పాఠశాలలను ఏర్పాటు చేస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని ఎనిమిది రకాలు చేయడం అశాస్త్రీయమన్నా రు. జీఓ 117ను రద్దు చేస్తూ ప్రవేశపెడుతున్న నూతన విధానాలు విద్యారంగానికి హాని చేసేవిగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ఒకటి నుంచి ఐదు తరగతుల ప్రాథమిక పాఠశాల.. ఆరు నుంచి పది లేదా 12 వరకు ఉన్నత పాఠశాలలుండాలని ఏపీటీఎఫ్ భావిస్తోందన్నారు. అయితే పాఠశాలలను ఇష్టానుసారంగా విభజించాలనుకోవడం సరికాదన్నారు.

సిఫార్సులకే ప్రాధాన్యం..

- దరఖాస్తులు ఎక్కువ.. యూనిట్లు తక్కువ
- బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరులో గందరగోళం



లబ్ధిదారులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న బ్యాంక్ ఉద్యోగులు, అధికారులు (ఫైల్)

బలిజిపేట:

కార్పొరేషన్ రుణాలతో స్వయం ఉపాధి పొందాలనుకున్న నిరుద్యోగులకు నిరాశ తప్పలేదు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకతకు పాతరేసి సిఫార్సులు ఉన్న వారికే సబ్సిడీ రుణాలు ఇచ్చేలా అధికారులపై ఒత్తిడి పెరిగింది. బలిజిపేట మండలంలో 126 యూనిట్లకు 780 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఇప్పటికి 80 యూనిట్లకు సంబంధించి లబ్ధిదారుల జాబితా బ్యాంక్‌లకు పంపించారు. ఇందులో చాలా మంది కూటమి నాయకుల సిఫార్సు పొందిన వారే ఉన్నారన్నది బహిరంగ రహస్యం. ఎమ్మెల్యే సిఫార్సు లేనిదే బ్యాంక్‌కు లబ్ధిదారు పేరు వెళ్లడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానించడంతో నిరుద్యోగులు ఎంతో సంబరపడిపోయారు. అర్హతలున్నవారు దరఖాస్తు చేసుకోవడంతో పాటు అధికారులు నిర్వహించిన ఇంటర్వ్యూలు కూడా పూర్తి చేశారు. తీరా బ్యాంక్‌లకు లబ్ధిదారుల జాబితా పంపించారంటూ ప్రకటనలు రావడంతో ఎంతో ఆశగా వాకబు చేసిన నిరుద్యోగులకు నిరాశే మిగిలింది. ఎమ్మెల్యే సిఫార్సు ఉన్నవారికే రుణాలు మంజూరవుతాయని తెలిపోవడంతో ఇవేం బీసీ కార్పొరేషన్ రుణాలురా బాబూ అంటూ అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

780 దరఖాస్తులు..

బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరుకు నోటిఫికేషన్‌ను అధికారులు ప్రకటించడంతో అర్హులైన వారు ఎంతో ఆశగా దరఖాస్తు చేసుకున్నారు. మండలానికి 126 యూనిట్లు కేటాయించగా 780 దరఖాస్తులు వచ్చాయి. యూనిట్లలో శ్లాబ్-1కు 89.. శ్లాబ్-2కు 28.. శ్లాబ్-3కు 9యూనిట్లు కేటాయించారు.

సిఫార్సు ఉంటేనే..

అధికారులు, బ్యాంకర్లు లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అర్హుల జాబితాలను బ్యాంకర్లకు పంపించే సమయంలో అధికారులపై ఒత్తిడి ప్రారంభమైంది. ఎమ్మెల్యే సిఫార్సు ఉన్నవారి పేర్లు మాత్రమే బ్యాంకులకు పంపించాలనే ఆదేశాలతో అధికారుల చేతులకు కళ్లెం పడింది. ఈ విషయాన్ని స్వయంగా ఎంపీడీఓ నగేష్ మండల సర్వసభ్య సమావేశంలోనే ప్రకటించారు. సిఫార్సులు ఉన్నవారికి మాత్రమే యూనిట్లు కేటాయించే విధానమైతే దరఖాస్తులు ఎందుకు ఆహ్వానించి, ఇంటర్వ్యూలు నిర్వహించారని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు అధికారులను ప్రశ్నించినా ప్రయోజనం లేకపోయింది.

వైఎస్సార్‌సీపీ వారికి అవకాశం లేకుండా..

వైఎస్సార్‌సీపీ హయాంలో సబ్సిడీ రుణాలు మంజూరు చేయడానికి గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీపీ చైర్మన్ గాను, ఎంపీడీఓ కార్యదర్శి గాను, బ్యాంకర్లు సభ్యులుగా ఉండే కమిటీ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూ నిర్వహించేది. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పాలకవర్గాల్లో వైఎస్సార్‌సీపీకి చెందిన వారే అధికంగా ఉన్నారు. దీంతో కూటమి ప్రభుత్వం ఇంటర్వ్యూల నిర్వహణలో వారికి అవకాశం ఇవ్వకుండా అధికారులు, బ్యాంకుల ప్రతినిధులు మాత్రమే ఉండేలా ఏర్పాట్లు చేసుకుని, వారికి నచ్చిన వారికి 50 శాతం రాయితీతో రూ. 2 లక్షల నుంచి ఐదు లక్షల వరకు రుణాలు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు.

> **అర్హుల జాబితాలు బ్యాంక్‌లకు..**
>
> యూనిట్లకు సంబంధించి దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించి జాబితాలను సిద్ధం చేశాం. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే బ్యాంకులకు అర్హుల పేర్లు పంపిస్తున్నాం. – ఏవీఎస్ నగేష్, ఎంపీడీఓ, బలిజిపేట

జీగిరాం జూట్ మిల్లును వెంటనే తెరిపించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

సాలూరు: మండలంలోని జీగిరాం జూట్ మిల్లును కూటమి ప్రభుత్వం వెంటనే తెరిపించాలని సీఐటీయూ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వైనాయుడు, జిల్లా అధ్యక్షుడు డి.రమణారావు, కార్యదర్శి బీవీ రమణ మాట్లాడారు. జిల్లాలో ఉన్న ఏకైక పరిశ్రమ జీగిరాం జూట్‌మిల్లును తెరిపించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని విడనాడాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు, జూట్ మిల్లు కార్మికులు 50 రోజులకు పైగా సమ్మె చేస్తే నాడు శిబిరానికి వచ్చిన ప్రస్తుత మంత్రి సంధ్యారాణి టీడీపీ అధికారంలోకి వస్తే జూట్‌మిల్లును తెరిపించి ఈ ప్రాంత కార్మికులకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్ని నెలలు గడుస్తున్నా నేటికీ జూట్‌మిల్లు వైపు కన్నెత్తి కూడా చూడకపోవడం శోచనీయమన్నారు. కూటమి ప్రభుత్వం ఇకనైనా స్పందించి మిల్లు కార్మికులందరికీ ఉపాధి కల్పించాలని లేకుంటే ఆందోళనకు సిద్ధమవుతామని స్పష్టం చేవారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



అవగాహన కల్పిస్తున్న అధికారి

పార్వతీపురం రూరల్: ఈ నెల 14వ తేదీ నుంచి నిర్వహిస్తున్న జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయని పార్వతీపురం అగ్నిమాపక శాఖాధికారి జి.ప్రభాకరరావు తెలిపారు. పాఠశాలలు, ఆర్టీసీ డిపోలు, గ్రామీణ ప్రాంతాల్లో, గ్యాస్ గొడౌన్‌లు, బహుళ అంతస్తుల సముదాయాలు, ఆస్పత్రుల్లో అవగాహన సదస్సులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ మేరకు ఆఖరు రోజైన ఆదివారం స్థానిక అగ్నిమాపక శాఖ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవగాహనతోనే ప్రమాదాలను నివారించవచ్చన్నారు.

శ్రీరాముడి ఆశీస్సులతో సుఖసంతోషాలతో ఉండాలి



శ్రీరాముడికి పూజలు చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: శ్రీరామచంద్రుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వయిజర్ కమిటీ సభ్యుడు, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ప్రార్థించారు. ఈ మేరకు సాలూరు పట్టణంలోని వెలమపేట రామమందిరం వద్ద ఆదివారం నిర్వహించిన సీతారాముల అన్న సంతర్పణ కార్యక్రమంలో రాజన్నదొర పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

అనంతరం భక్తులకు స్వామివా రి ప్రసాదాన్ని వడ్డించి భక్తులతో కలిసి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన బోధన అందిస్తాం..



అంపావల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న యూపీ పాఠశాల ఉపాధ్యాయులు

బలిజిపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించి విద్యావంతులుగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఈ మేరకు గలావల్లి, నారన్నాయుడువలస, అంపావల్లి, మిర్తివలస, తదితర గ్రామాల్లోని పాఠశాలల ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ, ప్రభుత్వ పాఠశాలల విశిష్టతను తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నారని తెలిపారు. అలాగే కార్పొరేట్ పాఠశాలల స్థాయిలో బోధనతో పాటు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఐదేళ్లు నిండిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

భామిని: ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లు కోసం విద్యార్థులంతా దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో ఎ.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో ఆదివారం కోరారు. 2025–26 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో చేరేందుకు ఈ నెల 26వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మెస్ బిల్లులు విడుదల చేయాలి

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల వసతిగృహాల మెస్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్ల సురేష్ ఓ ప్రకటనలో ఆదివారం డిమాండ్ చేశారు.

గత మూడు నెలలుగా వసతిగృహాలకు చెల్లించాల్సిన మెస్ బిల్లులు చెల్లించడం లేదని, దీంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఇప్పటికైనా బిల్లులు మంజూరు చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్



కార్మిక జోజప్ప దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న రెవరెండ్ ఫాదర్ కె. తోమస్ రెడ్డి

పార్వతీపురం టౌన్: ఈస్టర్ వేడుకలను మన్యం జిల్లాలో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి జిల్లా కేంద్రంలోని పండావీధిలో గల సెంట్‌జోన్స్ చర్చిలో రెవరెండ్ ఫాదర్ సునీల్ జోషఫ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోని ప్రజలందరినీ స్వస్థ పరచడానికి ఏసు మరలా లేచి వచ్చారన్నారు.

బెలగాంలో..

బెలగాం కార్మిక జోజప్ప దేవాయంలో రెవరెండ్ ఫాదర్ కె. తోమస్ రెడ్డి ఆధ్వర్యంలో సంఘ సభ్యులు ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తోమస్ రెడ్డి ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే ఏసు పునరుత్థానానికి సంబంధించి చరిత్రను సంఘ సభ్యులుకు వివరించారు.

315 మంది రోగులకు వైద్యపరీక్షలు

- శస్త్రచికిత్సలకు 150 మంది గుర్తింపు



శంబరలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

మక్కువ: విజయనగరంలోని శ్రీ సాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మక్కువ, శంబర, కవిరిపల్లి, కాశీపట్నం, మార్కొండపుట్టి గ్రామాల్లో నిర్వహించిన శిబిరాల్లో 315 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వారిలో 150మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించినట్లు కంటి వైద్య నిపుణుడు డాక్టర్ పి.రాజేష్‌కుమార్ తెలిపారు. వైద్యశిబిరంలో డాక్టర్ ఎ.లహరి, డాక్టర్ పి. రాజేష్, డాక్టర్ ఎం.జ్యోత్స్న, డాక్టర్ కె.పావని, డాక్టర్ ఎస్.కీర్తి, డాక్టర్ జి. తేజ తదితరులు పాల్గొన్నారు.

వేసవి వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి

పాలకొండ రూరల్: మూగజీవాలకు వేసవిలో వచ్చే వ్యాధులపై పశుపోషకులు, పెంపకందారులు, పాడిరైతులంతా అవగాహన పెంచుకోవాలని పాలకొండ పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ప్రభా మాణిక్యరావు సూచించారు. వేసవికాలంలో గొర్రెల్లో వచ్చే సాధారణ వ్యాధులు, వాటిని నివారణ చర్యలపై ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వేసవిలో సూక్ష్మజీవుల కారణంగా చిటుకు వ్యాధి(ఈటీ), అంత్రాక్స్ లేదా నల్లజాడ్యం, ఊపిరితిత్తుల్లో నెమ్ము లేదా న్యూమోనియా, పొగాళ్లు లేదా బురద పుండ్లు, మితువ కాళ్లు, గొంతువాపు వ్యాధులు వంటివి గొర్రెలకు వ్యాప్తి చెందుతాయి. గాలికుంటు, నీలినాలుక, బొబ్బరోగం, అమ్మతల్లి, నోటిపుండ్లు వంటివి వైరస్‌ల ద్వారా ఒకదాని నుంచి మరొకదానికి సంక్రమించి మందకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. తేలికపాటి వర్షాలు కురిసేటప్పుడు క్లాస్ట్రీడియం జాతి సూక్ష్మజీవుల వల్ల ఎక్కువ ప్రమాదం ఉంటుంది. బలిష్టంగా, ఆరోగ్యంగా ఉండే గొర్రెలు ఒక్కసారిగా ఎగిరిపడి కొట్టుకుని మరణించడం, కడుపును కాళ్లతో తన్నుకోవడం, కడుపు ఉబ్బడం, నల్లగా దుర్వాసన వచ్చే పారుడు, నోటి నుంచి నురగ రావడం, ఫిట్స్ వంటి లక్షణాల ద్వారా రోగాలను గుర్తించవచ్చు. ఈ సమస్యలకు చికిత్స అందించే క్రమంలో వైద్యుల సలహా మేరకు చర్యలు తీసుకోవాలి. రోగ నివారణకు అవసరమగు టీకాలు వెంటనే వేయించాలి. మూడేళ్ల వయసు నిండిన గొర్రె పిల్లలకు తప్పనిసరిగా నట్టల నివారణ మందు వేయాలి. మొదటి టీకా ఇచ్చిన 15 రోజుల తర్వాత బూస్టర్ డోస్ ఇవ్వాల్సి ఉంటుంది. ఏటా వేసవిలో వ్యాధుల నివారణకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని తెలిపారు.

ఆందోళన చెందకుండా అప్రమత్తంగా వ్యవహరించాలి



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఎస్ఐ సర్వేశ్వరరావు

పాలకొండ రూరల్: అగ్నిప్రమాదాలు జరిగేటప్పుడు ఆందోళన చెందకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, అలా అయితేనే ప్రమాదాల నుంచి బయటపడగలమని ఫైర్ ఎస్ఐ జామి సర్వేశ్వరరావు అన్నారు. స్థానిక పట్టణంలో గత కొన్నాళ్లుగా నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉదయం ఐసీడీఎస్ కార్యాలయం వద్దకు వెళ్లి, అంగన్‌వాడీ సిబ్బందికి అగ్నిప్రమాదాలు–వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్యాస్ లీకేజీ కారణంగా ఏర్పడే అగ్నిప్రమాదాలను ఏ విధంగా అడ్డుకోవాలో మాక్‌డ్రిల్ చేసి చూపించారు. అనంతరం అగ్నిప్రమాద నివారణ చర్యలు తెలిపే కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో బి.సిమ్మాలమ్మ, సూపర్‌వైజర్లు దశారత్నం, మేరి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర వ్యవసాయ విధానాలు అవలంబించాలి



రైతులకు టబ్బులు, టార్పాలిన్లు అందజేస్తున్న రస్తాకుంటుబాయి కేవీకే సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం వద్ద రైతులకు టార్పాలిన్లు, టబ్బులు ఆదివారం పంపిణీ చేశారు. చిన్న, సన్నకారు రైతులంతా ఆర్థికంగా ఎదిగేందుకు పంటల సాగులో సమగ్ర వ్యవసాయ విధానాలు అవలంబించాలని కేవీకే అధికారులు సూచించారు. అనంతరం జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల రైతులతో సమావేశమై లాభదాయక వ్యవసాయంపై అవగాహన కల్పించారు. సాగును లాభసాటిగా మార్చాలంటే ఏయే పంటలు ఏ విధంగా పండించాలన్న వాటిపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్‌కే ధ్రువ, డాక్టర్ జి.శివనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గోతుల పూడ్చివేత



బీటలు దేరిన రోడ్డు



మరమ్మతులకు తారు సిద్ధం చేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్...

సీతానగరం: మండలంలోని పలు రహదారులపై ఏర్పడిన గోతులను ఆర్అండ్‌బీ అధికారులు పూడ్చి వేయిస్తున్నారు. రహదారులు అధ్వానంగా మారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్న అంశంపై సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. చినభోగిలి – కాశీపేట గ్రామాల మధ్య గోతులను ఆదివారం పూడ్చారు.

వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్ చంద్రబాబు

- వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

పాలకొండ రూరల్: వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ సీఎం చంద్రబాబు అని, తన సొంతమామ ఎన్టీఆర్ నుంచి పార్టీని లాక్కున్న ఆయనకు విశాఖ మేయర్ పీఠం లాక్కోవడం ఒక లెక్కా అని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మండిపడ్డారు. ఇదే విషయమై ఆయన స్థానిక పట్టణంలో విలేకరులతో ఆదివారం మాట్లాడారు. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా ఉన్న ఓ బీసీ మహిళను కూటమి నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడి ఆమెను పదవి నుంచి దించేశారని, ఇది ప్రజాస్వామికమా..? అప్రజాస్వామికమా అని నిలదీశారు. 100 మంది కార్పొరేటర్లలో 24 మంది కార్పొరేటర్లు యాదవ సామాజిక వర్గానికి చెందిన వారైతే వారందరినీ రాజ్యాధికారానికి దగ్గర చేయాలనే సదుద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ సామాజిక వర్గానికే మేయర్ పదవి కట్టబెట్టారన్నారు. ఇప్పుడు అధికారం అడ్డం పెట్టుకుని కూటమి ప్రభుత్వం ఆ మేయర్ పదవిని అన్యాయంగా లాక్కుందని విమర్శించారు. ఇదంతా బీసీలకు రాజ్యాధికారం దక్కనివ్వకుండా కూటమి ప్రభుత్వం చేసే కుట్రగానే భావిస్తున్నామని, అంతేకాకుండా బీసీలపై జరిగిన రాజకీయ దాడిగానే దీనిని పరిగణిస్తున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కూటమి సర్కారు సామాజిక న్యాయానికి తూట్లు పొడుస్తోందన్నారు. మేయర్ సీటుపై ఓ బీసీ మహిళ కూర్చోవడం చూసి ఓర్వలేకనే కుతంత్రం చేసి మరీ ఆ సీటును దక్కించుకున్నారని ధ్వజమెత్తారు. కూటమి కుట్రలను బీసీలంతా నిలదీయాలన్నారు. నిజంగా ప్రభుత్వానికి బీసీలపై చిత్తశుద్ధి ఉంటే అదే సామాజిక వర్గం వారిని మేయర్ సీటుపై కూర్చోబెట్టగలదా అని సవాలు విసిరారు. అవసరాల కోసం ఎవరినైనా వాడుకోవడం, ఇతర పార్టీల నాయకులను భయపెట్టి పార్టీలోకి లాక్కోవడం వంటివి చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఆయన, ఆయన పార్టీల నాయకులు చేస్తున్న దౌర్జన్యకాండను ప్రజలంతా గమనిస్తున్నారని, వారే సమయం చూసి తగిన బుద్ధి చెబుతారన్నారు.

బాధ్యతల స్వీకరణ

కొమరాడ: తహసీల్దార్‌గా ఎ.సాయికామేశ్వరరావు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ధర్నా విరమణ

గుమ్మలక్ష్మీపురం: రేగిడి బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి రహస్యంగా తరలించి చికిత్స అందించడాన్ని నిరసిస్తూ పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఈ నెల 21వ తేదీన నిర్వహించాలనుకున్న ధర్నాను విరమిస్తున్నట్లు గిరిజన సంఘ నాయకులు పాలక రంజిత్‌కుమార్, పల్ల సురేష్, ఆరిక చంద్రశేఖర్, ఇంటికుప్పల రామకృష్ణలు ఆదివారం ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఆ ఘటనకు సంబంధించి, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయగా, కలెక్టరు స్పందించి చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఆ హెచ్‌ఎంను సస్పెండ్ చేశారని, అందుకే ధర్నా చేయడం లేదని స్పష్టం చేశారు.